

నిర్మల్‌లోని దివ్యనగరల్‌లో గల సబ్ స్టేషన్

## బోరిగాంలో ఫ్లాగ్ మార్చ్

ముథోల్, మే 13 : బోరిగాం గ్రామంలో సోమవారం జరిగిన ఘటన నేపథ్యంలో మంగళవారం ఉదయం దాదాపు 100 మంది పోలీసులతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. గ్రామంలో ఆయా వీధుల గుండా ర్యాలీ తీశారు. శాంతి భద్రతల పరిరక్షణకు తాము ఉన్నామని తెలిపారు. ముథోల్ ఎస్సై సంజీవ్‌తోపాటు పోలీసు బలగాలు పాల్గొన్నాయి.



బోరిగాంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

**కొత్త కనెక్షన్ నుంచి ఫిర్యాదుల వరకు..**

# స్మార్ట్‌గా ట్రాన్స్‌కో సేవలు

- టీజీఎన్పీడీసీఎల్ యాప్‌ను ఆధునికీకరించిన సంస్థ
- అరచేతిలోనే అందుబాటులోకి 20 రకాల సేవలు




టీజీఎన్పీడీసీఎల్ యాప్ ఇదే

నిర్మల్, మే 13(నమస్తే తెలంగాణ) : కొత్త కనెక్షన్ నుంచి ఫిర్యాదుల స్వీకరణ వరకు స్మార్ట్‌ఫోన్ ద్వారా పొందేలా టీజీఎన్పీడీసీఎల్ యాప్‌ను రూపొందించింది. మొదట 2024లో ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. అయితే ఈ యాప్ ద్వారా సేవలు పరిమితం కావడం, తరచూ బిల్లుల చెల్లింపులపై ఆంక్షలు విధిస్తుండడంతో వినియోగదారులు యాప్‌ను పెద్దగా వినియోగించలేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పులు చేర్పులు చేసి దాదాపు 20 రకాల సేవల ద్వారా అందుబాటులోకి తెచ్చారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి టీజీఎన్పీడీసీఎల్ యాప్ అని డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత యూఎస్ సీ(యూనిక్ నంబర్ ఇన్ ఎలక్ట్రిసిటీ సర్వీస్) నంబరు నమోదు చేస్తే యాప్ అందుబాటులోకి వస్తుంది. ఈ యాప్‌ను చాలా మంది డౌన్ లోడ్ చేసుకుని సేవలను పొందుతున్నారు.

### యాప్ నుంచే దరఖాస్తులు

గృహ అవసరాలతోపాటు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం కార్యాలయాలు, మీ సేవా కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పని లేదు. టీజీఎన్పీడీసీఎల్ యాప్ ద్వారా విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అవసరమైన పత్రాలను యాప్‌లోనే లోడ్ చేసిన తర్వాత అధికారులు పరిశీలించి విద్యుత్ కనెక్షన్ ఇస్తారు. అలాగే రైతులు కూడా ట్రాన్స్‌ఫార్మర్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారులకు విద్యుత్ అధికారులు అందించే సేవలపై వారి ఫోన్ నంబర్‌కు మెసేజ్ వస్తుంది. విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తినా, విద్యుత్ చౌర్యం జరిగినట్లు సమాచారం ఉంటే యాప్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంది. వీటితోపాటు విద్యుత్ చార్జీల టారీఫ్ వివరాలు, భద్రత సూచనలను సులభంగా పొందేలా ఆధునీకీకరించారు. సంస్థ పరిధిలో ఇప్పటి వరకు 10 లక్షలకు పైగా వినియోగదారులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వినియోగిస్తున్నారని అధికారులు చెబుతున్నారు. స్మార్ట్ ఫోన్ యాప్‌తోపాటు వెబ్‌సైట్‌లలోనూ ఆన్‌లైన్ సేవలను సులభంగా పొందవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

### మరిన్ని సేవలు..

విద్యుత్ వినియోగదారులు ఈ యాప్ ద్వారా తమ సమస్యలను నేరుగా తెలియజేయవచ్చు. విద్యుత్ మీటరు నంబరుతో పాటు సమస్యల వివరాలను నమోదు చేస్తే అధికారులు పరిష్కరిస్తారు. ఫిర్యాదు చేసిన తర్వాత ప్రస్తుతం దాని స్టేటస్ ఏమిటన్నది తెలుసుకోవచ్చు. సమస్య పరిష్కారం విషయంలో సంతృప్తి చెందకపోతే తిరిగి మళ్లీ ఫిర్యాదు చేయవచ్చు. ఈ యాప్‌లో ముఖ్యంగా వినియోగదారులు తమ విద్యుత్ వినియోగంపై మీటరు ద్వారా సెల్ఫ్ రీడింగ్ తీసుకుని పంపవచ్చు. దీని ప్రకారం బిల్లులు జారీ అవుతాయి. అలాగే సర్వీస్ నంబర్ నమోదు చేసుకుని ప్రతినెలా తమ విద్యుత్ బిల్లులను ఇందులోనే చెల్లించవచ్చు. అలాగే తాము ఇప్పటి వరకు చెల్లించిన బిల్లుల వివరాలను తెలుసుకునే వీలుంటుంది. వినియోగదారులు తమ విద్యుత్ సర్వీసుకు ఆధార్, మొబైల్ నంబరును లింక్ చేసుకోవచ్చు. దీనిద్వారా ప్రతినెలా బిల్లులకు సంబంధించిన సమాచారం మెస్సేజ్ వస్తుంది. ఇలాంటి సేవలతో పాటు విద్యుత్ వినియోగంపై సందేహాలు ఉంటే సమాచారాన్ని పొందవచ్చు. విద్యుత్ కనెక్షన్ కావాలనుకునే వారు ఎలా దరఖాస్తు చేసుకోవాలి. అప్పటికే ఉన్న కనెక్షన్‌కు సంబంధించి పేరు మార్పిడి ఏ విధంగా చేసుకోవాలి, విద్యుత్ లోడ్ వివరాలు ఉంటాయి. వీటితోపాటు టారిఫ్ వివరాలు, కరెంటును ఆదా చేసే చిట్కాలు, సేఫ్టీ టిప్స్ ఉన్నాయి.

### వేగంగా సేవలు పొందే అవకాశం..



టీజీఎన్‌పీడీసీఎల్ యాప్ ద్వారా విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను సత్వరమే పరిష్కరించుకోవచ్చు. అలాగే సంస్థ అందించే సేవలను వేగంగా పొందే అవకాశం ఉంది. ముఖ్యంగా కొత్తగా తీసుకునే డొమెస్టిక్, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తమ సమయాన్ని వృథా చేసుకోవాల్సిన అవసరం లేదు. ఈ యాప్‌లో వివరాలను నమోదు చేసి కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అన్నీ సక్రమంగా ఉంటే 24 గంటల్లో కనెక్షన్ మంజూరవుతుంది. యాప్‌లో సూచించిన అడ్రస్‌కు మా సిబ్బంది వచ్చి కనెక్షన్ ఇస్తారు. ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా, పూర్తి పారదర్శకంగా విద్యుత్ సేవలను అందించేందుకు ఈ యాప్‌ను సంస్థ అందుబాటులోకి తెచ్చింది.

*- సుదర్శనం, ఎస్ఈ, ఎన్‌పీడీసీఎల్*



ఆదిలాబాద్ మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన జొన్నలు

**జొన్నల కొనుగోళ్లు**

# సక్రమంగా సాగేనా?

- అమ్మకాలకు దళారుల పన్నాగాలు
- పత్తి కొనుగోళ్లలో అక్రమాలు

ఆదిలాబాద్, మే 13(నమస్తే తెలంగాణ) : జిల్లాలో జొన్నను సాగు చేసిన రైతులకు మద్దతు ధర కల్పించడానికి ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.3371తో 15 కేంద్రాల్లో పంటను కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో యాసంగితో జొన్న సాగు విస్తీర్ణం పెరగడంతోపాటు దిగుబడులు ఎకరాకు 15 నుంచి 18 క్వింటాళ్ల వరకు వచ్చాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.3371 ఉండగా.. ప్రైవేట్ వ్యాపారులు క్వింటాలుకు రూ.2500తో కొనుగోలు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ధర తక్కువ ఉండడంతో ప్రభుత్వం కేంద్రాలకు భారీగా పంట వచ్చింది. ప్రభుత్వ కేంద్రాల వద్ద పంటను విక్రయించడానికి పడిగాపులు కాస్తున్నారు.

### దళారుల అక్రమ దందా

జొన్నల కొనుగోళ్లలో అక్రమాలకు దళారులు పన్నాగాలు ప్రారంభించారు. మహారాష్ట్రలో తక్కువ ధరకు పంటను కొనుగోలు చేసి జిల్లాకు తీసుకొస్తున్నారు. గ్రామాల్లో రైతుల పట్టాలు తీసుకుని వారితో ఒప్పందం కుదుర్చుకుని ప్రభుత్వ కేంద్రాల్లో జొన్నలు విక్రయిస్తున్నారు. ఇటీవల మహారాష్ట్ర నుంచి అక్రమంగా జిల్లాకు తరలిస్తున్న జొన్నల వాహనాలను భీంపూర్ పోలీసులు పట్టుకున్నారు. కొనుగోళ్లలో అక్రమాలను నివారించడానికి జిల్లా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. దళారులు మాత్రం కొత్త మార్గాల ద్వారా పంటను అమ్మడానికి ప్రయత్నాలు వీడడం లేదు.

### పత్తి కొనుగోళ్లలో అక్రమాలు

ఇటీవల ముగిసిన పత్తి కొనుగోళ్లలో భారీ అక్రమాలు జరిగాయి. మార్కెటింగ్, వ్యవసాయశాఖ అధికారులు పత్తి కొనుగోళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరించి అక్రమాలకు తెరలేపారంటూ ప్రభుత్వం ఆదిలాబాద్ మార్కెట్ కార్యదర్శి మధూకర్, ఇచ్చోడ మండల వ్యవసాయ శాఖ అధికారిని సస్పెండ్ చేసింది. దళారులు తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేసి సీసీఐకి విక్రయించడానికి మార్కెట్ యార్డులకు తీసుకురావాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు 3400 టీపీలను జారీ చేశారు. అధికారులు దళారులకు సహకరించడంతో రైతుల పేరిట పత్తిని సీసీఐకి విక్రయించి భారీగా సొమ్ము చేసుకున్నారు. జొన్నల కొనుగోళ్లలో దళారులు అక్రమాలకు పాల్పడే ప్రమాదం ఉండడంతో ఉన్నతాధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, సాగు చేసిన రైతులకు నష్టం జరగకుండా చూడాలని అన్నదాతలు కోరుతున్నారు.

### క్రాప్ బుకింగ్ అనుమానాలు..

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వానకాలం, యాసంగిలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను తెలుసుకునేందుకు క్రాప్ బుకింగ్ చేపడుతారు. యాసంగిలో క్రాప్‌బుకింగ్‌లో జాప్యం జరిగింది. జొన్న పంట చేతికొచ్చిన వివరాల సేకరణ ప్రారంభం కాలేదు. తర్వాత వ్యవసాయ శాఖ సిబ్బంది పంటల వివరాలు సేకరించిన కచ్చితమైన సమాచారం ఏ మేరకు తీసుకున్నారనే విషయంలో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వానకాలం సీజన్‌లో సాగు చేయాని రైతులు పత్తిని పండించారన్నట్లు క్రాప్ బుకింగ్ చేయడంలో దళారులకు అవకాశం ఇచ్చినట్లుయిందని రైతు సంఘాల నాయకులు ఆరోపించారు. క్రాప్ బుకింగ్ సక్రమంగా జరిగితే సాగు చేసిన రైతులు మాత్రమే ప్రభుత్వ కేంద్రాల్లో అమ్ముకునే అవకాశం ఉంటుందంటున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

## సాగుపై అవగాహన కలిగి ఉండాలి

**ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**

బేల, మే 13 : రాష్ట్ర ప్రభుత్వం సాగు అంశాలపై అవగాహన కల్పించేందుకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే నూతన కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం సాగుపై సిరసన్న గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆకస్మికంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సాగుపై జూన్ 13వ తేదీ వరకు శాస్త్రవేత్తలతో బృందాలను ఏర్పాటు చేసి పంటల పై అవగాహన కల్పిస్తారన్నారు. పాటించాల్సిన మెలకువలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలుపుతారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్, కృషి విజ్ఞాన కేంద్రం డాక్టర్ ప్రవీణ్ కుమార్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తుండగా భీంపూర్ మండల నీపాని వద్ద జొన్నల వాహనాలను పట్టుకున్న పోలీసులు

## బాల్యం నుంచే వ్యాయామం చేయాలి

- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్
- నేరడిగొండలో పిల్లల పార్కు ప్రారంభం



పిల్లల పార్కును ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

నేరడిగొండ, మే 13 : బాల్యం నుంచే వ్యాయామం చేయడం పిల్లల ఉత్తమ లక్షణం అని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన పిల్లల పార్కును ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్‌తో కలిసి ప్రారంభించారు. ముందుగా ఎస్పీకి చిన్నారులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ సీఐ భీమేశ్, నేరడిగొండ ఎస్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## కౌన్సిలర్ టికెట్ ఇప్పిస్తానని మోసం

- రూ.12.50 లక్షలు తీసుకుని ఉడాయించిన వెంకటేశ్
- మోసం చేసిన వ్యక్తిని రిమాండ్ తరలించిన పోలీసులు

ఎదులాపురం, మే 13 : మున్సిపల్ కౌన్సిలర్ టికెట్ ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ సాయిబాబా లాడ్జి యజమాని కుమారుడు వట్టంవార్ వెంకటేశ్ రణదీవ్‌నగర్‌కు చెందిన తోకల దేవేందర్ (వాటర్ ప్లాంట్ వ్యాపారి)కి వార్డు కౌన్సిలర్ టికెట్ ఇప్పిస్తానంటూ రూ.12.50 లక్షలు దశల వారీగా డబ్బులు తీసుకున్నాడు. మోసపోయానని తెలుసుకుని దేవేందర్ ఫిబ్రవరి 8, 2025లో ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి నుంచి తప్పించుకూ తిరుగుతున్న వెంకటేశ్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.

**ఇతర రాష్ట్రాల పంట ఉత్పత్తులను**

# కొనుగోలు చేస్తే చర్యలు

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా
- బేల సబ్ మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోళ్ల పరిశీలన
- జూన్ మొదటి వారంలోపు కొనుగోళ్లు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

బేల, మే 13: ఇతర రాష్ట్రాల పంట ఉత్పత్తులను మన రాష్ట్రంలో కొనుగోళ్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా హెచ్చరించారు. మంగళవారం సబ్ మార్కెట్ యార్డులోని జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జొన్నల కొనుగోలు ప్రక్రియను ఈ నెల చివరి నాటికి, జూన్ మొదటి వారంలో పూర్తి చేయాలని ఆదేశించారు. హమాలీలు, లారీల కొరత వంటి సమస్యలపై ఆరా తీసి సమస్యలను పరిష్కరించాలని, రేపటి లోగా హమాలీలు కేంద్రానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆదిలాబాద్ జిల్లాలో 16 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇంకా అదనంగా రెండు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ యేడాది మన జిల్లాలో సుమారుగా 7 నుంచి 8 లక్షలు ఎకరాల్లో జొన్న పంట పండించడం జరిగిందన్నారు. హమాలీ, స్టిచింగ్ చార్జీలను నిబంధనల ప్రకారం తీసుకోవాలని, అధికంగా తీసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలదేవి, డీసీవో మోహన్ నాయక్, ఎంపీడీవో మహేందర్ కుమార్, మండల వ్యసాయాధికారి సాయి తేజరెడ్డి పాల్గొన్నారు.



బేల సబ్ మార్కెట్ యార్డులో జొన్న రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

## ప్రశాంతంగా పాలిసెట్

ఎదులాపురం, మే 13 : ఆదిలాబాద్ జిల్లాలో మంగళవారం నిర్వహించిన పాలిసెట్ అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కొనసాగింది. 1,102 మంది విద్యార్థులకు 1026 హాజరయ్యారు. 76 మంది గైర్హాజరయ్యారు. నిమిషం ఆలస్యం నిబంధన ఉండడంతో ఉదయం 10 గంటల నుంచే విద్యార్థులను లోనికి అనుమతించారు. కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వేసవి దృష్ట్యా తాగు నీటితోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచామని ప్రిన్సిపల్ రమేశ్‌బాబు తెలిపారు.

### నిర్మల్ జిల్లాలో..

నిర్మల్ చైన్‌గేట్, మే 13 : నిర్మల్ జిల్లాలో పాలిసెట్ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 2,422 మంది దరఖాస్తు చేసుకోగా.. 8పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు. 117 మంది గైర్హాజరయ్యారన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసినట్లు తెలిపారు.



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

## వీర జవాన్లకు నివాళి

నార్నూర్, మే 13 : ఉగ్రవాదుల దాడిలో వీర మరణం పొందిన జవాన్లకు అంబేద్కర్ అసోసియేషన్, గ్రామస్తుల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్ నుంచి గాంధీ చౌరస్తా మీదుగా కుమ్రం భీం చౌరస్తా వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. వీరు జవాన్లకు అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. ఇక్కడ మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, విద్యావేత్త బాలాజీ కాంబ్లే, సహకార సంఘం డైరెక్టర్ దుర్గే కాంతారావు, మాల మాహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు లోకండే చంద్రశేఖర్, బ్రిజ్జిలాల్, అన్నా బావుసాటే కమిటీ మండలాధ్యక్షుడు మహేందర్ ఉన్నారు.